ఘనంగా సంక్రాంతి సంబరాలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- పతంగులు ఎగురవేసిన చిన్నారులు
- శిల్పారామానికి భారీ జనం

(శేరిలింగంపల్లి జోన్‌బృందం)

ముంగిట్లో రంగురంగుల ముత్యాల ముగ్గులు.. గొబ్బెమలు.. చిన్నారుల సాంప్రదాయ వస్త్రధారణలు, యువకుల పతంగుల పోటీల నడుమ భోగి, సంక్రాంతి, కనుమ వేడుకలు ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు పిల్లాపాపలతో ఆనందంగా జరుపుకున్న సంక్రాంతి పండుగ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్, చందానగర్, శేరిలింగంపల్లి, రాయదుర్గం, గచ్చిబౌలి, మాదాపూర్, హఫీజ్‌పేట, బెల్‌కాలనీలో దేశ నలుమూలల నుంచి వచ్చి స్థిరపడ్డ వారందరూ తెలుగు పండుగలను ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ పతంగులు ఎగురవేస్తూ ఉల్లాసంగా గడిపారు. మహిళలు



ఇళ్ల ముందు ముగ్గులు

వివిధ రకాల పిండి వంటలు తయారు చేయడం, ఇళ్ల ముందు ముగ్గులతో పండుగ శోభ సంతరించుకుంది. కొంతమంది నగరశివారుల్లోని ఫాంహౌస్‌లకు వెళ్లి స్నేహితులతో కలిసి సరదాగా గడిపారు. కొన్ని ప్రాంతాల్లో కోడిపందెలు నిర్వహించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

చందానగర్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని చందానగర్ డిజన పరిధిలో సంబరాలు అంబరాన్ని అంటాయి. ఉదయానే ఇంటి పరిసరాలను శుభ్రం చేసి రంగురంగుల ముగ్గులు తీర్చిదిద్దారు. పీజేఆర్ స్టేడియంలో నిర్వహించిన పతంగుల వేడుకల్లో చందానగర్ కార్పొరేటర్ మంజులరెడ్డి పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్



శిల్పారామంకు తరలివచ్చిన సందర్శకులు

శిల్పారామంలో సందడే.. సందడి

రాయదుర్గం: మాదాపూర్‌లోని శిల్పారామంలో పల్లె వాతావరణం లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. అధిక సంఖ్యలో తరలివచ్చిన సందర్శకులతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. గంగిరెద్దుల ఆటలు, హరిదాసులు, బుడబుక్కల, పిట్టల దొర, కొమ్మ దాసరుల విన్యాసాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అదేవిధంగా సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బెంగళూరు నుంచి వచ్చిన భారతనాట్య కళాకారులు సుప్రియ శిష్యబృందం ప్రదర్శన ఆద్యంతం సందడిగా సాగింది. అదేవిధంగా కల్‌కత్తా కళాకారుల కూచిపూడి నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.



కళాకారుల నృత్య ప్రదర్శనలు



కార్పొరేటర్‌తో కలిసి ఉప కమిషనర్‌కి వినతిపత్రం ఇస్తున్న బస్తీసభ్యులు

శ్రీరామ్‌నగర్-ఏ బస్తీలో సమస్యలు పరిష్కరించండి

గాజులరామారం, జనవరి16 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్ శ్రీరామ్‌నగర్-ఏ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీసభ్యులు కార్పొరేటర్ రావుల శేష గిరిరావుతో కలిసి గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాల నుంచి అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, వాటిని బాగు చెయ్యాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నవాబు, ఉపాధ్యక్షుడు శింగారం మల్లేష్, బస్తీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, ఉపాధ్యక్షులు మహేష్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



త్రైతసిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాన్ని ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

ప్రజలు దైవజ్ఞానాన్ని పెంచుకోవాలి

గాజులరామారం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాన్ని గాజులరామారం, సూరారం డివిజన్‌ల్లో ఐదు రోజుల పాటు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక వరంగల్, తొర్రూరు, హైదరాబాద్ కమిటీ సభ్యులు ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్లు రచించిన ఈ గ్రంథాన్ని కమిటీ సభ్యులు ప్రతీ కాలనీ, బస్తీలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు భోగి, సంక్రాంతి పండుగ విశిష్టత గురించి వివరించారు. అలాగే ప్రజలు దైవజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఓంప్రకాష్ ఆచారి, సుధాకర్, నర్సింహాచారి, రావణాచారి, శ్రీనివాస్, చంద్రబాబు, సైదులు, నిర్మల, పద్మ, సమత, లక్ష్మి, రోహిణి, అక్షయ పాల్గొన్నారు.



రామాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న మురళీధర్‌రావు, మాధవరం కాంతారావు

ఆలయాల స్వచ్ఛత ఉద్యమంగా నిర్వహించాలి

కూకట్‌పల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని దేవాలయాల్లో స్వచ్ఛత కార్యక్రమాన్ని ఉద్యమంగా నిర్వహించాలని బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. ఈనెల 22న అయోధ్యలో రామమందిరంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశంలోని అన్ని దేవాలయాల ప్రాంగణాల్లో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టాలన్న ప్రధాని మోదీ పిలుపు మేరకు కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని కూకట్‌పల్లి గ్రామంలో గల పట్టాభిసీతారామచంద్రస్వామి ఆలయంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆలయాలను శుభ్రం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంపై సంస్థ ఛైర్మన్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావును అభినందించారు. అయోధ్య గ్లోబల్ సిటీగా అభివృద్ధి చెందబోతోందని, ప్రధాని ఆధ్వర్యంలో దేశం మొత్తం ఏకమై ముందుకు సాగాల్సిన అవసరముందన్నారు. అనంతరం మాధవరం కాంతారావు మాట్లాడుతూ.. రామమందిర ప్రారంభోత్సవంలో దేశ ప్రజలందరినీ భాగస్వామ్యం చేయడంలో భాగంగా ఇంటింటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ చేశామన్నారు. జనవరి 22న ప్రతిఇంట్లో రామజ్యోతి వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాయినేని సూర్యప్రకాష్‌రావు, షేక్ షాజహాన్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, యోగేష్, వినోద్, నాగరాజు, ఆలయ కమిటీ, స్వచ్ఛ భారత్ అభియాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్, జనవరి16 (ఆంధ్రజ్యోతి): భిక్షపతి 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీదేవి థియేటర్, భిక్షపతి ఎన్‌క్లేవ్, జవహర్‌కాలనీ, కైసల్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.



సీఐ కాంత్రికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేశం

ప్రొ.జయశంకర్ విగ్రహం ధ్వంసంపై ఆందోళన

పేట్‌బషీరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశం, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆందోళనకు దిగారు. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ మహవీర్‌నగర్ చౌరస్తాలోని ప్రొ.జయశంకర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తి ధ్వంసం చేశాడు విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశం కార్యకర్తలతో ఆందోళనకు దిగారు. ధ్వంసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చెయ్యాలని రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, ఆందోళన చేస్తున్న వారికి నచ్చచెప్పి అక్కడ నుంచి పంపించారు. అనంతరం జగద్గిరిగుట్ట సీఐ కాంత్రికుమార్‌కు కార్పొరేటర్ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ధ్వంసం చేసిన గోవింద్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మతిస్థిమితం సరిగా లేని గోవింద్‌ను ఎర్రగడ్డ మానసిక వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో నుంచి జారిపడి మహిళ మృతి



మృతి చెందిన మహిళ

పేట్‌బషీరాబాద్,జనవరి16 (ఆంధ్రజ్యోతి): ఆటోనుంచి ప్రమాదవశాత్తు ఓ మహిళ జారిపడి మృతి చెందింది. కేపీహెచ్‌పీ నుంచి జగద్గిరిగుట్టకు వెస్తున్న ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మార్గమధ్యలో న్యూ హరిణిప్రియ బార్ సమీపంలో ప్రమాదవశాత్తు కింద పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతి చెందిన మహిళ వివరాల కోసం ఆరా తీస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వృద్ధుడి అదృశ్యం



వెంకట్‌రావు

మియాపూర్, జనవరి16 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ గోకుల్‌ప్లాట్స్‌లో నివాసం ఉండే వెంకట్‌రావు(65) సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం చుట్టుపక్కల, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం



వ్యక్తి మృతదేహం

దుండిగల్, జనవరి16 (ఆంధ్రజ్యోతి): సూరారం ప్రాంతంలోని జ్యోతి మిల్క్ కంపెనీ వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికులు దుండిగల్ పోలీసులకు సమాచారం అందించారు. దుండిగల్ సీఐ శంకరయ్య సిబ్బందితో వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. 25 నుంచి 35 సంవత్సరాలు గల గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెంది ఉంటాడని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భరత్‌సింహారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఘనంగా భరత్‌సింహారెడ్డి పుట్టినరోజు

పేట్‌బషీరాబాద్, జనవరి16 (ఆంధ్రజ్యోతి): అభిమానులు, కుటుంబసభ్యులు, స్నేహితుల మధ్య బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన జన్మదిన వేడుకలకు పార్టీ నాయకులు, స్నేహితులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి గజమాలలతో భరత్‌సింహారెడ్డిని సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

● సమస్య పరిష్కరించాలి

కంటోన్మెంట్ మాజీ సైనికుల సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి అజయ్‌భట్‌ని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్‌లోని శ్రీరామ్‌నగర్, పద్మానగర్ స్థలాల సరిహద్దు సమస్యను వివరించి పరిష్కరించాలని కోరారు.

- పేట్‌బషీరాబాద్, (ఆంధ్రజ్యోతి)



జైపాల్‌రెడ్డి కృషి వల్లే మెట్రో మంజూరైంది

● మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): నగరానికి మెట్రో రైలు ప్రాజెక్టు మంజూరు చేయించేందుకు మాజీ కేంద్రమంత్రి, దివంగత నేత జైపాల్‌రెడ్డి ఎంతో కృషి చేశారని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. జైపాల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం నెక్లెస్‌రోడ్డులోని స్ఫూర్తిస్థల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. మెట్రో ప్రాజెక్టుకు అప్పటి కేంద్రమంత్రిగా వయెబులిటీ గ్యాప్ ఫండింగ్‌కు కృషి చేశారని గుర్తుచేశారు. మెట్రో ప్రాజెక్టులకు స్టాండర్డ్ గేజ్ అవసరమని తాను ఇచ్చిన ప్రజెంటేషన్‌కు మార్గనిర్దేశనం చేశారని పేర్కొన్నారు. జైపాల్‌రెడ్డి పట్టుదల కారణంగానే మెట్రో ప్రాజెక్టు మంజూరైందని చెప్పారు.

● బాధ్యతల స్వీకరణ

హైదర్‌నగర్, జనవరి16 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకన్నను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిందం శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, సాధ, మహేష్, నర్సింగరావు, మహమ్మద్ షకీల్ పాల్గొన్నారు.



బురదమయంగా రహదారి

ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మురుగు నీరు పారడంతో బురదమయంగా ఉన్న రహదారి

పేట్‌బషీరాబాద్, జనవరి16 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా బురదమయంగా మారిన రోడ్ల కారణంగా బస్తీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని వెన్నెలగడ్డలో అసెంబ్లీ ఎన్నికల ముందు రూ.22 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రామరాజునగర్ కాలనీ సమీపంలోని మెట్రో వద్ద డ్రైనేజీ సర్వీస్ రోడ్డును తవ్వి వదిలేశారు. దీంతో మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. ఫలితంగా ఆ ప్రాంతమంతా బురదమయంగా మారింది. ఈ రోడ్డు బురదమయంగా మారడంతో స్థానిక బస్తీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు తవ్విన కాంట్రాక్టర్ మట్టితో పూడ్చి రోడ్డుపై సిమెంటు వ్యర్థాలు అలాగే వదిలేశారు. బురదమయంగా మారిన రోడ్డుపై ద్విచక్ర వాహనం, పాదాచారులు వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేయకపోవడంతో డ్రైనేజీ పొంగి దుర్వాసన వెదజల్లుతోందని ఆప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను పూర్తి చెయ్యాలని కోరుతున్నారు. మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

'మాక్సివిజన్'లో ఆర్మీ సిబ్బందికి ఉచితంగా పరీక్షలు

హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మాక్సివిజన్ సూపర్ స్పెషాల్టీ కంటి ఆస్పత్రిలో గురువారం నుంచి ఈనెల 31 వరకు ఆర్మీ సిబ్బందికి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. సోమాజిగూడ, అత్తాపూర్, బేగంపేట, మా దాపూర్, కూకట్‌పల్లి, మదీనాగూడ, ఏఎస్‌రావునగర్, దిల్‌సుఖ్‌నగర్, సంతోష్‌నగర్, కొత్తపేట, తార్నాక, వరంగల్, మణికొండ ప్రాంతాల్లోని తమ ఆస్పత్రుల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.



అయోధ్య రామమందిరం నమూనాలో తయారైన కారు

రామమందిరం ఆకారంలో కారు

● పాతబస్తీకి చెందిన సుధాకర్ సృష్టి

మదీన, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో బహదూర్‌పురా సుధాకార్స్ మ్యూజియంలో రామమందిరం నమూనాలో కారును రూపొందించారు. వినూత్న కార్ల రూపకర్త సుధాకర్ పాతబడిన మెటాడోర్ వాహనం రూపురేఖలు మార్చి కదిలే రామమందిరాన్ని తయారుచేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మందిరాన్ని పోలి ఉండే వాహనం 22 ఫీట్ల పొడవు, 26 ఫీట్ల ఎత్తులో ఉంటుందని. రెండు రోజుల్లో పనులు పూర్తయి సందర్శకులకు అందుబాటులోకి వస్తుందని, డ్రైవర్ మాత్రమే కూర్చునేలా తయారు చేశామని, గంటకు 60కి.మీ వేగంతో నడుస్తుందని చెప్పారు.

● బాచుపల్లి సీఐని కలిసిన కాంగ్రెస్ నేతలు



బాచుపల్లి సీఐగా బాధ్యతలు చేపట్టిన ఉపేందర్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

- నిజాంపేట్, (ఆంధ్రజ్యోతి)

విలన్లకు మహా నేతల పేర్లా..!

అభ్యంతరం వ్యక్తం చేసిన ఏఐవైఎఫ్

హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కారం సినిమాలో విలన్లకు కారల్ మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) అధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లాఖాద్రీ, కే.ధర్మేంద్రలు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సినిమా దర్శకుడు త్రివిక్రమ్‌కు మతిభ్రమించిందని, శ్రామికవర్గ నేతల పేర్లు విలన్లకు పెట్టి సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. కారల్ మార్క్స్ ప్రపంచానికి కమ్యూనిజాన్ని పరిచయం చేసిన మహా మేధావి అని, దాస్ కేపిటల్ రచించి శ్రామిక వర్గ విముక్తికి జీవితం ధారపోశారని అన్నారు. మార్క్సిజంతో రష్యాలో విప్లవాన్ని విజయవంతం చేసిన ఘనత లెనిన్‌దని అన్నారు. అలాంటి మహా నేతల పేర్లు సినిమాలో విలన్లకు పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని, ఇందుకు త్రివిక్రమ్, హీరో మహేష్‌బాబులు బహిరంగ క్షమాపణ చెప్పాలని, పేర్లను వెంటనే తొలగించేలా సెన్సార్ బోర్డు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

జూపార్కులో సందర్శకుల సందడి

మదీన, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో మంగళవారం పాతబస్తీలోని పలు పర్యాటక స్థలాలు సందర్శకులతో కళకళలాడాయి. నగరం నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా సందర్శకులు వచ్చారు. సుమారు 23 వేల మంది జూను తిలకించారు. జూపార్కు సమీపంలోని సుధాకార్స్ మ్యూజియానికి కూడా పెద్దసంఖ్యలో జనం తరలివచ్చారు.



జూపార్కులో కిటకిటలాడుతున్న సందర్శకులు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

మియాపూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ మెట్రోస్టేషన్ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ 6వఫేజ్‌కు చెందిన ఎం.వెంకన్న కుమారుడు ప్రవీణ్(18) బైక్‌పై వెళ్తున్నాడు. మియాపూర్ మెట్రో స్టేషన్ పిల్లర్ నెంబర్ 617 వద్ద మంగళవారం రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని బైక్‌పై వచ్చిన ప్రవీణ్ ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. స్థానికులు అతడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యాటక రంగానికి ఊతమిస్తున్న భారత్ గౌరవ్ రైళ్లు

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 'భారత్ గౌరవ్ రైళ్లు భారతీయ సాంస్కృతిక, చారిత్రాత్మక కేంద్రాలను సందర్శించేందుకు పర్యాటకులకు సేవలందిస్తున్నాయి. గతేడాది 24 రాష్ట్రాల్లో భారత్ గౌరవ్ రైళ్లు 172 ట్రిప్పులతో 96,491 మంది పర్యాటకులను కోరుకున్న ప్రదేశాలకు తీసుకువెళ్లి తిరిగి గమ్యస్థానాలకు చేర్చినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్', 'దేఖో అప్నాదేశ్' కార్యక్రమాలకు అనుగుణంగా రైల్వే అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీరామ్- జానకి యాత్ర, శ్రీజగన్నాథ్ యాత్ర, గర్వి గుజరాత్ పర్యటన, అంబేద్కర్ సర్క్యూట్, ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రసిద్ధ కేంద్రాలను సందర్శించేందుకు భారత్ గౌరవ్‌యాత్ర రైళ్లలో ప్రత్యేక ప్యాకేజీలను అందిస్తున్నారు. విజ్ఞాన, వినోద యాత్రల ప్యాకేజీలో భాగంగా అవసరమైన ప్రాంతాలకు బస్సుల్లో తీసుకువెళ్లడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. విహారయాత్రలు, హోటళ్లలో వసతి సౌకర్యం, టూర్ గైడ్‌లు, భోజనం తదితర సౌకర్యాలను సమకూరుస్తున్నారు. భారత్ గౌరవ్ రైలు పథకంలో భాగంగా ప్రత్యేకంగా రూపొందించిన కోచ్‌లను రైల్వే అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. మరిన్ని వివరాలకు పర్యాటకులు https://www.irctctourism.com/bharatgaurav వెబ్‌సైట్‌ను సందర్శించాలని రైల్వే అధికారులు సూచించారు.

హోల్‌సేల్ కిరాణా షాపులో అగ్నిప్రమాదం

రూ.50 లక్షల విలువైన ఆస్తినష్టం

రాయదుర్గం, జనవరి16 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గంలోని హోల్‌సేల్ కిరాణాషాపు లో ఉదయం 6 గంటల సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఫ్రిజ్‌లో షార్ట్‌సర్క్యూట్ ద్వారా చెలరేగిన మంటలకు మూడు షాపుల్లో ఉన్న కిరాణా సామగ్రి కాలిపోయింది. షాపుపై అంతస్తులో నివాసం ఉండే యజమాని కిరణ్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫిలింనగర్‌కు చెందిన అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు 50 లక్షల రూపాయల విలువైన ఆస్తి కాలిబూడిదయిందని యజమాని కిరణ్ రాయదుర్గం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.



కిరాణా షాపులో ఎగిసిపడుతున్న మంటలు

లింగంపల్లి నుంచి బయలుదేరే రైళ్ల వివరాలు

గచ్చిబౌలి, జనవరి16(ఆంధ్రజ్యోతి): లింగంపల్లి రైల్వేస్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్ల వివరాలు..

- ఉదయం 4.40 అమరావతి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి- విజయవాడ
- 6.15 గంటలకు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి- విశాఖపట్నం
- 12.25 గంటలకు దేవగిరి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి-ముంబాయ్
- 18.25 గంటలకు నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి- తిరుపతి
- 18.30 కోకనాడ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి-కాకినాడ (సోమ, బుధ, శుక్రవారం)
- 19 గం.లకు కోకనాడ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి-కాకినాడ (మంగళ,గురు,శనివారం)
- 20.30 గంటలకు గౌతమిఎక్స్‌ప్రెస్ లింగంపల్లి-కాకినాడ
- 21.05 గంటలకు నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి- నర్సాపూర్
- 21.40 గంటలకు హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి-ఇండోర్ (ఆదివారం)